సెభాష్

# "విలపించని విజయ"

"ప్రభు"

"ఏం, అట్లా ఉన్నావ్?"

మసక చీకట్లో మిలమిలా మెరుస్తోంది విజయ. గడ్డి పరకలు చేత్తో సాగదీస్తూ, ఊడిరాకుండా సున్నితంగా వాటి వొళ్ళు నిమురుతోంది విజయ. నడిచివొచ్చి సరస్సు వొడ్డున కూర్చున్నాము. అన్ని మాటలు చెప్పకున్నాక ఎట్లాగ జారిపోయామో నిశ్శబ్దంలోకి—కొంత సేపలాగనే కూర్చున్నామనుకుంటాను.

నాకు తెలీకుండానే, ఆ ఉదయం జరిగినదంతా జ్ఞప్తికి వొచ్చింది. ఆ ఆలోచనలతో మనసంతా నిండిపోయి, బలవంతాన విజయతో మాట్లాడుతున్నాను. ఇదంతా ఆమెకి చెప్తే ఈ బరువు తగ్గుతుందని ఆశ; కాని, ఆమెకి ఏమని చెప్పేదీ!

ప్రశాంతంగా ఉంది అంతా—బోట్ క్లబ్‌లో ఎవరో కూర్చుని సిగరెట్లు కాల్చుకుంటున్నారు. అప్పుడూ అప్పుడూ గాలిలో తేలివొస్తూన్న కంఠాలనిబట్టి వాళ్ళు మాకవతల ప్రక్కగదిలో దిగిన ఇంగ్లీషువాళ్ళని అనుకున్నాను. అక్కడా అక్కడా ఇళ్ళలో దీపాలు అస్పష్టంగా కనిపిస్తున్నాయి. సరసుచుట్టూ ఉన్న చెట్లు నల్లటి మేఘంమల్లే కనిపిస్తూ ఏదో భయపెడుతున్నై. చంద్రోదయం కావొచ్చే సమయం....ఈ చీకట్ల చిక్కదనం క్రమంగా, నెమ్మదిగా, పల్చబడుతోంది.

ఏమని చెప్పనూ విజయకి!

ఆ ఉదయం హఠాత్తుగా కలుసుకున్నాను శారదని - సరస్సులో బోట్ మీద తిరుగుతూ. తెడ్డు వేసుకుంటూ తిరగగలగడం ఒక థ్రిల్; అందుకని పొద్దుటే వొచ్చాను. విజయ నిద్ర లేవలేదు. రాత్రి ఏదో చదువుతూ ఆలశ్యం చేసి పడుకుంది. ఆ గంట ఆలశ్యానికి మూడు గంటల కాంపెన్‌సేషన్.

హఠాత్తుగా ఆమె నావొంక చెయ్యి ఊపుతూ పిలుస్తూ కనిపించింది....వెనక సూర్యుడి కిరణాలూ, నీటిలో ఆ ప్రతిఫలమూ. ఆమె ముఖం నాకు కనపడనివ్వలేదు. మరెవరినోనని వెనక్కి తిరిగి చూశాను. అక్కడ ఎవ్వరులేరు.

ఇంతట్లో ఆమె నా దగ్గరికి రానేవొచ్చింది. శారద.

ఒక్కసారి నా కళ్లని నేనే నమ్మలేకపోయాను. తేలికగా నీళ్లమీద తేలుతూ వొచ్చి నన్ను కలుసుకుంది. తెల్లబోయి చూస్తూన్నాను. అప్పుడు ఆమె చాలా అందమైనదని అనుకునే వాడిని ఉదయాన అప్పుడు పూసిన పువ్వుమల్లే తయారై, విలాసంగా బోట్ నడుపుకుని వొస్తూంటే, సరస్సంతా మరీ అందంగా కనిపించింది.

"నువ్వా, శారదా!"

ఏమంటాను!....రెండేళ్ల క్రిందట క్షణం వొదిలిపెట్టేదికాదు - తీరిక ఉంటే, ఒక్కడినీ కూర్చుంటే ఆమె నా కళ్ళనిండా, మనసునిండా ఉండేది....ఆమెకోసం నేనూ, నాకోసం ఆమే జీవించేవాళ్ళం....ఆమె అడుగుల సవ్వడిగుర్తు నాకు; ఆమె వాడే సుగంధాలు తెలును నాకు- చీకటిలో ఆమె ఉంటే తెలుసు నాకు....ఇవేళ.

బాధగా నవ్వింది శారద...."ఎంత పరాయిదానినైపోయాను!" అంటూ.

అనలేను-కాని, మామధ్య ఎన్ని జన్మల దూరం! కాని, ఆ క్షణంలో మా నూతన సంబంధం, మా మధ్యనఉన్న దూరం, అన్నీ మరిచిపోయి, ఆ మాట అన్నందుకు బాధ పడ్డాను నేను.

అలాగే ఉండిపోయాం. ఎవ్వరమూ మాట్లాడలేదు-ఏం చెప్పకుంటామని!

"వెళ్తాను-ఆయన లేస్తారింక....అల్లదుగో-మా బంగళా-రా ఒకసారి...."

నిరాశగా చుట్టూ చూశాను-నెమ్మదిగా ఆమె తనవైపుకి జారి వెళ్ళిపోతూంది. జరిగినవన్నీ తలుచుకుంటూ అలాగే ఉండి ఉండి వెనక్కి వచ్చాను నేను.

అప్పటినించీ చెప్పలేని ఆవేదన....ఆమె నిస్సహాయత్వం తలుచుకుని, నా దైన్య స్థితి తలుచుకోలేక అందరూ అన్న మాటలు నమ్మాను నేను....అతన్ని ఆమె కావాలని చేసుకుందని. నిజమే-శారద రాసింది పరిస్థితులన్నీ, కాని....

"పాపం శారద చాలా బాధపడుతోంది, కదూ?"

గడ్డి పరకలు వొదిలేసి, బద్ధకంగా చేతుల మీద జారబడుతూ అన్నది విజయ-

త్రుళ్లిపడ్డాను ఈమె కెట్లా తెలుసునో!

"అవును....నీ కెట్లా తెలిసింది?" అన్నాను సాధ్యమైనంతగా నా ఆశ్చర్యాన్ని దాచుకుంటూ.

"నా కట్లాగనే తెలుస్తూంటుందిలే..."

కొంచెం వెన్నెల వొచ్చి, క్రమంగా పరిసరాలనల్ల రంగుకి అందాలు పూస్తోంది. కదలకుండా అట్లానే కూర్చుంది విజయ. నేను ఒక్కణ్ణే ఐపోయాను మళ్ళా

వెన్నెల నీడలమధ్య నడుస్తున్నాము—రూముకి మంచు పడుతోంది....సాయంత్రపు బట్టలతో వచ్చేము మేము.

"నీకు చలిలేదు కాదూ?" అంధి-విజయ హటాత్తుగా నావైపు తిరిగి,

అమె మనసెట్లా పనిచేస్తూందో!

"పాపం, శారద నిన్ను మరీ మరీ తలుచుకుంటూంది!"

ఉండీ ఉండీ పాలలాంటి విజయ పాలరాతి మల్లే ఐపోయి మాటలాడుతూ ఉంటుంది. ఎవరి శాపమో!

"నాకు తెలీదు!" అన్నాను.

"అవును....నాకు నిజంతప్ప తెలీదులే!"

విచారంగా నవ్వింది విజయ....ఆమెకీ మూడ్స్ ఉన్నాయని జ్ఞాపకంచేస్తూ. ఒక్కసారి నా పరిస్థితిలోని అసహ్యత నన్నావరించి, ఎంతో నీచత్వంలో పడిపోయాను....ఆమెని ఇంత సుందర పరిసరాలకి తీసుకొచ్చి ఇట్లా పాడుకలలూ, నేనూ....

"క్షమించు విజయా....మనస్సివాళ స్వాధీనంలో లేకుండా పోతోంది....నిన్నూ మరిచిపోతున్నాను—" అన్నాను.

సున్నితంగా నా చేతిని తీసుకుంది విజయ దెబ్బలుతిని నొప్పులు పట్టిన వొంటిమీద మెత్తటి చేతులు వేసినట్లుంది ఆస్పర్శ...

"పాపం!—నీకేం తెలీదు" అంది.

వింటున్నాను... ఈ పరిస్థితిలో నాకు తెలీనిదీ, ఆమెకి తెలిసిందీకూడానా?....కాని ఆమె విజయ-ఆమె కనరాని విషయాలు లేనేలేవు!

"అట్లా పద....శారద బంగళాముందు నిలచిపోదాం...."

అలసట అనిపించలేదు ఆమె చేతుల్లో ఉంటే మేఘాలమీద తేలిపోతాను నేను....

శారదా, భర్తా వరండాలో కూర్చుని డిన్నర్ తీసుకుంటున్నారు హటాత్తుగా ఆమె ఎందుకో నవ్వింది-విలాసం కోసమే, ఆనందం కోసమే, పుట్టినట్టు ...

"విను...."

"పోదాం" అన్నాను ఒకనాడు శారద నన్ను మరిచిపోతే చాలుననే అనుకున్నాను; ఆమె సుఖంగా ఉంటే నా ఆనందం అనుకున్నాను....కాని అంత విలాసంగా ఆ సాయంత్రమే ఆమె నవ్వుతోంటే నాలో ఉన్న మంచితనాన్ని వెక్కిరిస్తోన్నట్లు బాధపడ్డాను నేను.

నెమ్మదిగా నావేళ్ళు నొక్కుతూ, "అంత బాధ ఎవరికోసమని?....పద...."

హొటలుకి వెళ్ళిపోయాము నాకొకటే ఆలోచన - ఆమె అట్లా ఎలా ఉండగలుగుతోందోనని-నా మనస్తాపంలో ఏవొంతూ ఆమెకి లేదే!

"ఆమె బాధ పడలేదని బాధ పడుతున్నావా?"

నన్ను తగలకుండా ప్రక్కన కూర్చుని, అంది విజయా తేలికగా నవ్వుతూ

"ఆమె బాధపడినా నీకు బాధే!"

అంతా మరీ స్పష్టంచేస్తోంటే శల్యపరీక్ష మల్లే బాధ; కాని, వెన్నెల జల్లుమల్లే ఆమె చిరునవ్వు-ధైర్యం చెప్తూ.

"దీనికి అంతులేదు విజయా - ఎందుకనీ ఇదంతా ఆలోచించడం?" అన్నాను నిస్సహాయంగా.

"నీకోసమనీ....శారద విన్నెడిపిస్తోంది.... కనిపించాలా?"

లేచి నిలబడ్డాను - ఇదా నిజం?

"నాకేం తెలుసును?"

"సాయం కాలం ఏంచూశామో!....పోనీ-నీ ప్రణయం ఉన్నత స్థితిలో ఉన్నప్పుడు ఒక్కసారైనా, నిట్టూర్పులూ, వేదనలూ తప్ప నీకేం మిగిలిందయ్యా?"

ఈ అమ్మాయికి మానసిక విలువలు లేవు; ఉద్రేకాలు లేవు. అంతా నాస్తికత్వం అనిపించింది.

"ప్రణయానికి కౌగలింతలూ, ముద్దులూ మాత్రమే ఫలితాలా?" అన్నాను. వీలైనంత కోపంతో.

రెండు చేతుల్లోనూ రెండు చెక్కిళ్లూ దాచుకుని, "నీతి నేనూ నేర్చుకుంటాను...."అన్నది విజయ.

ఆ క్షణంలో నాపూర్వగాథల నిట్టూర్పులూ. శారదని తలచిన వేదనలూ అన్నీ గాలిలోకి పోయాయి. చల్లటి వెన్నెలరాత్రి; అందాల చేతుల్లో మమ్మల్ని దాచుకున్న ప్రకృతి; ఈ ఏకాంతం, ప్రశాంతత; నా దగ్గర విజయ ఈ దుఃఖానికి అర్థంలేదనిపించింది.

నవ్వుకున్నాను నేను—ఇంత ఆనందాన్ని చేతుల్లో దాచుకుని దూరాన చీకట్ల దుఃఖాలని తలచుకుని బాధపడ్డాను—ఎంత మూర్ఖుడినై పోయాను నేను!

క్షణక్షణానికి ఆమె సౌందర్యం ఇనుమడించి పోతోంది; ఆమె వెన్నెలల్లో, మేఘాలలో, నక్షత్రాలలో తేలిపోతోంది—విలాసంగా నవ్వుతూ; ఆనందాల గాలులు వీచుతూ....

"అట్లా కూర్చో...."

తానేలేచి దూరంగావెళ్ళి కూర్చుంది విజయ పంతగిస్తూ.

మిగిలినదంతా నిరర్థకం — ఆ దూరం భరింపలేక పోయాను.

"పాపం!—నేనంటే నీకెంతో అభిమానం కదూ?"

వెక్కిరిస్తోనట్లు అంది విజయ — అలానే నన్ను తప్పించుకుంటూ. "నాకు తెలుసును" అన్నాను.

"అందుకనే, నిట్టూర్పులువిడు; ఆవేదన అనుభవించు...."

చల్లటి గాలిలో, వెన్నెలలో, తారలలో కలిసి పోయింది విజయ....ఆ పరిసరాలలోని ప్రాణం పోయినట్లు ఒక్కసారి అన్నీ వికారంగా అయి పోయాయి—ఇంత ప్రపంచంలో ఒక్కణ్ణి ఐపోయాను నేను....

నా ఒంటరితనం, చేయిజారిన ఆ ఆనందమూ, విజయా—అన్నీ తలుచుకుంటే భరించలేక పోయాను. జీవితం ఎంతో అసహ్యం అయి పోయింది....ఆ దుఃఖం....

ఎంతసేపో అట్లా గడిచింది—నిద్దరలోనో, ఆలోచనలలోనో కళ్లనించి వొచ్చిన అశ్రువులు.

నీరసంగా కళ్ళు తుడుచుకోబోయాను.

లావణ్యం, మృదుత్వం ఇంతకన్న లేవనిపించే చల్లటి వ్రేళ్ళు నాకళ్లు తుడిచాయి....నా చుట్టూ నిర్వచించలేని మాధుర్యం నిండి పోయింది; కళ్ళు తెరవకపోయినా వెన్నెల వెయ్యిరెట్ల అందంతో అనునయస్తోంది; ఒక్కసారి ఎందుకు బ్రతకాలో అర్థమైంది. కళ్ళు తెరవాలని లేదు....కాని, ఆమె విజయ!

"ఎందుకొచ్చావు?-జాలి కలిగిందా?"

చిరునవ్వుతో మరీ వికసిస్తూ-"నువ్వు పిలిచావు-అందుకని-" అన్నది విజయ.

---

ప్రపంచకంలో దుఃఖాలకీ దౌర్జన్యాలకీ సగం కారణం ధనంమీాది వ్యామోహం. సగం కారణం ధనం లేకపోవడం.